
బషీర్‌బాగ్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

'రేవంత్‌రెడ్డికి బుద్ధి చెబుతాం'

గన్‌ఫౌండ్రీ: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు టికెట్ కేటాయించకపోతే తన తడాఖ చూపిస్తామని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. పార్లమెంటు సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని నిరసిస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో పార్లమెంటు స్థానాలలో 3 స్థానాలు ఎస్సీలకు ఉండగా రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించకపోవడంపై మండిపడ్డారు. మాదిగల ద్రోహి అయిన సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. మాదిగలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 10 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిక స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగా, పూజలోల్ల రవి మాదిగ, ఇనుముల నర్సయ్య మాదిగ పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: రాష్ట్ర స్థాయిలో మహిళా వైద్య విద్యార్థులకు మహిళ వైద్య విద్యార్థులకు జరిగిన క్రీడల్లో ఉస్మానియా వైద్య విద్యార్థులు కనబరిచిన ప్రతిభ అభినందనీయమని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం ఆయన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి సన్మానించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 37 మెడికల్ కళాశాల విద్యార్థినులు పాల్గొనగా చెస్, ఫుట్‌బాల్, టెన్నిస్ వంటి క్రీడల్లో మొదటి రెండవ స్థానాలను దక్కించుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలోనే ఓరల్ చాంపియన్‌షిప్‌లో 3వ స్థానంలో ఉస్మానియా మెడికల్ కళాశాల నిలిచిందన్నారు. అదేవిధంగా ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ విద్యార్థులకు వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకొని జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 7న ప్రశంస పత్రాలను ప్రిన్సిపాల్ అందజేయనున్నట్లు ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ కె.భవాని తెలిపారు. క్విజ్ పోటీలను అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మిషా, డాక్టర్ శ్రీలత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టకియుద్దీన్, డాక్టర్ కిరణ్మయ్, ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్, పీడీ సందీప్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో ప్రైవేటు కళాశాలల సమస్యలు పొందుపరచండి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న గౌరి సతీష్, బాలకృష్ణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించబడే విధంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఇంటర్మీడియేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీ సతీష్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడి, డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..10 సంవత్సరాలుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో సమస్యలు ఏమాత్రం పరిష్కరించకపోవడంతో పెద్ద ఎత్తున పేరుకుపోయాయన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రైవేట్, ఇంటర్, డిగ్రీ కళాశాలల సమస్యలన్నీ పెడితే పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రైవేటు కళాశాలల సమస్యలన్ని మేనిఫెస్టో పెట్టి పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రెటరి పార్థసారథి, శ్రీనివాస్, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. జలమండలి, బల్దియా అధికారులు ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరిస్తున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగడం లాంటి సమస్యలు ప్రజాదర్బార్‌లో తన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. అంతేకాకుండా తాగునీటి సమస్యపై ఫిర్యాదులు వచ్చాయని, అయితే ఈ విధంగా వచ్చిన ఫిర్యాదులు మరునాడే పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం ఆయన మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులతో మాట్లాడారు. ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న విషయం ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులపై ఉందన్నారు.

అనాథ పిల్లలకు ప్రత్యేక కోటాను కేటాయించండి


మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: అనాథ పిల్లలకు అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కోటాను కేటాయించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు మంగళవారం ఆయన మెమోరాండం అందజేసి సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పిల్లలతో పాటు అనాథలుగా ఉన్న వేలాది మంది పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రత్యేక కోటాను ఏర్పాటు చేస్తే అనాథ పిల్లలకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో కూడా నిరుపేద మహిళలకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వలస కూలీలు గోషామహల్‌తో పాటు గ్రేటర్‌లో వేలాది మంది ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం విద్యారంగంలో ప్రత్యేక చోటు కల్పిస్తే బాగుంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి దృష్టికి ఆనంద్‌కుమార్ గౌడ్ సూచనలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లోధ్ కులస్తుల సంక్షేమానికి నిరంతరం కృషి


వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలను ప్రజల్లో పెంపొందించేందుకు లోధ్ సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. గంగాబౌలిలోని రాణి అవంతిబాయి లోధ్ భవన్‌లో లోధ్ కులస్తుల చారిత్రక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..లోధ్ సమాజ్‌కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. బ్రిటీష్ వారిని లోధ్ సమాజ్ నాయకురాలు రాణి అవంతి బాయి గడగడలాడించిందన్నారు. లోధ్ కులస్తుల చారిత్రకత ఎంతో మహోన్నతంగా ఉందన్నారు. లోధ్ కులస్తుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

గోల్కొండ: పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో పడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సోమవారం టోలీచౌకీ టూమ్స్ రోడ్డులోని ఆదిత్యానగర్ కాలనీలోని పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో కాలినడకన వెళ్తున్న మహ్మద్ (78) పడ్డాడు. అక్కడే పని చేస్తున్న కార్మికులు జేసీబీ సాయంతో ఆయనను బయటకు తీశారు. తీవ్ర గాయాలైన మహ్మద్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మహ్మద్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ పనులను అయ్యప్ప ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ వారు చేపడుతున్నారని వారి నిర్లక్ష్యం వల్లే మహ్మద్ మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇంకెన్నాళ్లిలా..?

- మీరాలంమండిలో నిత్యం ట్రాఫిక్ జామ్
- దుకాణాల ముందు అడ్డగోలుగా వస్తువుల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


మీరాలంమండి ప్రధాన రోడ్డు కబ్జాలతో వాహనదారులకు తప్పని తిప్పలు

చార్మినార్: మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు అటు రైతులతో పాటు ఇటు వ్యాపారులు, వినియోగదారులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. నిజాం కాలంలో 1805లో అప్పటి ప్రధాని నవాబ్ అలం యార్ జంగ్ బహదూర్ అప్పట్లో నగర ప్రజలకు కూరగాయలను అందుబాటులో ఉంచడానికి మీరాలమండిని ఏర్పాటు చేసినట్లు ఇక్కడి పూర్వీకులు చెబుతున్నారు. నగర ప్రజలకు పెద్ద ఎత్తున అన్ని రకాల కూరగాయలు ఒకేచోట విక్రయించడానికి ఏర్పాటు చేసిన ఈ మీరాలం మండి దశాబ్దాలు గడుస్తున్నా.. ప్రజా ఆధరణ కొనసాగుతుంది. పాతబస్తీలోని మీరాలం మండి పరిసర ప్రాంతాల వినియోగదారులే కాకుండా దూరపు ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి తమకు అవసరమైన కూరగాయలను ప్రతినిత్యం ఖరీదు చేస్తుంటారు. దీంతో ప్రతి రోజు మీరాలం మండి కూరగాయల మార్కెట్ రైతులు, వినియోగదారులు, వ్యాపారులతో కిటకిటలాడుతుంది.

నిత్యం ట్రాఫిక్ రద్దీ.. పట్టించుకోని పోలీసులు..

- మీరాలంమండి కూరగాయల మార్కెట్‌తో పాటు నిత్యావసర వస్తువుల క్రయవిక్రయాలు సైతం ఇక్కడ పెద్ద ఎత్తున కొనసాగుతాయి. పాతబస్తీకి వెళ్లే రెండు రోడ్ల నడుమ ఈ మీరాలం మండి కూరగాయల మార్కెట్ ఏర్పడింది.
- మదీనా నుంచి పాతబస్తీకి వచ్చే ప్రధాన రోడ్డులోని పత్తర్‌గట్టి రోడ్డు ద్వారా లోనికి వస్తే మీరాలంమండి కూరగాయల మార్కెట్ దర్శనమిస్తుంది.
- అలాగే దారుషిఫా, పురానీహవేలి ప్రధాన రోడ్డు నుంచి లోనికి వస్తే కూడా మీరాలం మండి దారి కనిపిస్తుంది.
- ఇలా పాతబస్తీలోని రెండు ప్రధాన రోడ్లకు నడుమ మీరాలం మండి కూరగాయల మార్కెట్, ఫుడ్ గ్రేన్ మర్చెంట్ వ్యాపారాలు కొనసాగుతున్నాయి.
- ఎంతో చారిత్రాక ప్రాధాన్యత గల ఈ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.
- కేవలం 24 అడుగల రోడ్డు ఉన్న ఈ మార్కెట్‌లో ప్రతిరోజూ గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నాయి.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి...

- సంబంధిత ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు.
- ఒక్కసారి ఈ రోడ్డుపైకి వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నరకయాతన అనుభవిస్తున్నారు.
- ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు ముందుకు రాకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు ఒకరికొకరు వాగ్వాదానికి దిగి ఘర్షణ పడుతున్నారు.
- ఇక్కడి ఇరుకు రోడ్డులోని ఫుడ్ గ్రేన్ మర్చెంట్స్ దుకాణాల నిర్వాహకులు తమ దుకాణాల ముందు నాలుగైదు అడుగుల మేరకు రోడ్డును అక్రమించి తమ వస్తువులను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది.
- దుకాణాల ముందు ఏర్పాటు చేస్తున్న తమ వస్తువులను తొలగిస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయని వినియోగదారులు అంటున్నారు.

ఉద్యమకారులకే పదవులు కేటాయించాలి


కిశోర్ కుమార్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో ఉద్యమకాలం నుంచి పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి ఇన్‌చార్జి పదవి, ఇతర పదవులను ఇవ్వాలని బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన జియాగూడలో మాట్లాడుతూ..ఇటీవల కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ నుంచి బడా నాయకులు పదవులు అనుభవించి ఇతర పార్టీలకు మద్దతు పలికి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారని పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించి ఇన్‌చార్జి పదవి, ఇతర పదవులను ఇవ్వాలని హైకమాండ్‌ను త్వరలో కోరుతున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొంతమంది బడా నాయకులు పనిగట్టుకుని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇలాంటి వారితో పార్టీకి ఒరిగేది ఏమీ లేదన్నారు. నియోజకవర్గం నుంచి హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

3, 4వ తేదీల్లో సిటీ కళాశాలలో జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు జరుగనున్నదని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్ఐఆర్, ఢిల్లీ సహకారంతో ఎనర్జీ మెటీరియల్స్-పరికరాలలో పురోగతి అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుందన్నారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

అబిడ్స్: జల్సాలకు అలవాటు పడి నలుగురు దారి దోపిడీకి పాల్పడగా మంగళ్‌హాట్ పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లి యూసుఫెని దర్గా వద్ద నివాసం ఉండే రషీద్ (26) ఈ నెల 1న రాత్రి చార్మినార్ ప్రాంతంలో ఉన్న తన లాడ్జీకి వెళ్లేందుకు ఆటోను అద్దెకు తీసుకుని బయల్దేరాడు. మంగళ్‌హాట్ ఆర్య సమాజ్ ప్రాంతం వద్దకు ఆటో చేరుకోగానే నలుగురు గుర్తుతెలియని దుండగులు యాక్టివా వాహనాలపై వచ్చి ఆటోను ఆపి కత్తితో బెదిరించి చేతులను కట్టివేసి రషీద్ జేబులో ఉన్న రూ.5,300 నగదును తీసుకుని పరారయ్యారు. రషీద్ వెంటనే మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సోమవారం సాయంత్రం పురానాపూల్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చాంద్రాయణగుట్టకు చెందిన అబ్దుల్ రెహాన్ (20), మహ్మద్ సోహెల్ (21), షేక్ అఫ్రోజ్(20)లను అదుపులోకి తీసుకుని విచారించగా దారి దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి యాక్టివా వాహనం, రూ.3100 ల నగదును, కత్తి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరొక యువకుడు షాబాజ్ పరారీలో ఉన్నాడు. సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నేతృత్వంలో గోషామహల్ ఏసీపీ కె.వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎం.మహేష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జె.మహేందర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 8 మందికి జైలు

యాకుత్‌పురా: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఎనిమిది మంది మందు బాబులకు కోర్టు 2 నుంచి 4 రోజుల పాటు జైలు శిక్షతో పాటు జరిమానా విధించిందని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనలు నడుపుతున్న 21 మందిపై కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ డీడీ కోర్టు న్యాయమూర్తి 16 కేసుల్లో ఒక్కొక్కరికి రూ.2100ల జరిమానా విధించారు. ఈ కేసులో నలుగురికి 4 రోజులు, మరో నలుగురికి 2 రోజుల శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు రద్దు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి


రేణుకకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: విధి నిర్వహణలో మృతి చెందిన బల్దియా కార్మికురాలు రేణుకకు నష్టపరిహారంగా రూ.18 లక్షల ఇన్సూరెన్స్‌ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సి.మల్లేష్ డిమాండ్ చేశారు. ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన బల్దియా కార్మికురాలు రేణుక చిత్రపటానికి మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ..ఆదివారం ఉదయం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద పనిచేస్తూ రేణుక వడదెబ్బతో కిందపడిపోయిందన్నారు. అనారోగ్యంతో ఉన్న ఆమె ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే గుండె నొప్పితో మృతి చెందిందన్నారు. ఆమెకు ఇన్సూరెన్స్ కింద రూ.18 లక్షలు ఇవ్వడమేకాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు కల్యాణ్, యాదయ్య, వెంకటేష్, సత్తపాల్, కృష్ణ, భాగ్యమ్మ, రమాదేవి, కౌసల్య పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు


ఇఫ్తార్ విందులో మజ్లిస్ ఎమ్మెల్యేలు, నాయకులు

యాకుత్‌పురా: రంజాన్ సందర్భంగా మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ అధ్యక్షుడు మహ్మద్ మొహీనుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏతేబర్ చౌక్ గుల్జార్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా, చార్మినార్ ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, మీర్ జుల్ఫికర్‌అలీ, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ ఆఫాంధీ, మాజీ ఎమ్మెల్యే, మజ్లిస్ పార్టీ సీనియర్ నేత మహ్మద్ ముంతాజ్ అహ్మద్ ఖాన్, కార్పొరేటర్లు సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహ్మద్ వసీవుద్దీన్, మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దానం తదితరులు

షేక్‌పేట్‌లో..

గోల్కొండ: ఇఫ్తార్ విందులో ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే, కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ కాలనీల సమాఖ్య ఆధ్వర్యంలో షేక్‌పేట్ ఆడమ్స్ కాలనీలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, షేక్‌పేట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ వజాహత్ అలీఖాన్, ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్, సయ్యద్ ఇలియాజ్, జీషాన్, రషీద్, సమీఉల్లా, మహ్మద్ జలీల్, సయ్యద్ ఖాదత్ అలీ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ డ్రైవర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

నాంపల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పనిచేసే ప్రైవేట్ కారు డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. 13 నెలలుగా బిల్లులు చెల్లించని కారణంగా వేతనాలు అందడం లేదని నిరసన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు వేతనాలు లేకుంటే ఎలా జీవనం సాగించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాంపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ప్రైవేట్ కారు డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం అండర్ టేకింగ్ తీసుకున్న కారు డ్రైవర్స్ వాణిజ్య పన్నుల శాఖ మొత్తంలో దాదాపు 600 డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న మాకు పూట గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ వెంటనే స్పందించి తమకు వేతనాలు మంజూరు చేయాలని కోరారు. అబిడ్స్, చార్మినార్, సారుస్‌నగర్, హైదరాబాదు రూరల్ డివిజన్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

అభినందనలు


ఆనం అహ్మద్‌ను అభినందిస్తున్న నారాయణ పాఠశాల విద్యావేత్తలు

విజయనగర్‌కాలనీ: ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ స్టాండర్డ్ నాలెడ్జ్ ఒలింపియార్డ్ (ఐఎస్‌కేఓ) పరీక్షలో విజయనగర్ కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాల 4వ తరగతి విద్యార్థిని ఆనం అహ్మద్ 14వ ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచినది. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో చిన్నారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యావేత్తలు జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్య దశలోనే చిన్నారి చదువులో ప్రతిభ కనబరస్తూనే ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలో 14వ ర్యాంక్ సాధించడం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ.నవీన్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ నౌషీర్ ఖాతూన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన అవసరం



నాంపల్లి: చిన్న పిల్లల్లో వచ్చే మందబుద్ధి(ఆటిజం) వ్యాధిపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి అన్నారు. మంగళవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ప్రపంచ ఆటిజం దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ప్రసంగించారు. మందబుద్ధి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ వ్యాధి లక్షణాలు పిల్లల్లో ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డాక్టర్ కల్యాణి శ్రీనివాస్, ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరవేస్తాం: మాధవీలత


మాధవీలతను సన్మానిస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ జెండాను ఎగరవేస్తామని బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గోషామహల్ నియోజకవర్గంలో కార్పొరేటర్లు రాకేష్ జైస్వాల్, శంకర్ యాదవ్, నాయకులు పాండు యాదవ్‌లతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈసారి బీజేపీని గెలిపించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. అధికార పార్టీ కానీ బీఆర్ఎస్ కానీ తమకు పోటీ కాదన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన మేరు సంఘం నాయకులు



అబిడ్స్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మేరు సంఘం నాయకులు మంగళవారం కలిశారు. మేరు కులస్తులకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు న్యూఢిల్లీకి వెళ్లిన భట్టి విక్రమార్కకు రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, శివకుమార్, గంగాపురం దశరథ్, పోల్కం వినయ్‌రాజ్, గోపాల్‌రెడ్డిలు ఆయనను కలిసి మెమోరాండం అందజేశారు. రాజ్యసభలో, విధాన సభలో, చైర్మన్ పదవులను లక్షలాది మంది జనాభా ఉన్న మేరు కులస్తులకు ఇవ్వాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

వాహనాల తనిఖీల్లో రూ.10 లక్షలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామస్వామి

జియాగూడ: పురానాపూల్ కూడలి వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి రసీదులు లేని సుమారు రూ.10 లక్షల నగదు లభించినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పురానాపూల్ వద్ద ఎస్ఐ నర్సింగ్‌రావు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా పురానాపూల్ నుంచి న్యూ ఆగాపురా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా ఎంఏ జావెద్(35) నాంపల్లిలో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. తనిఖీల్లో అతడి వద్ద ఎలాంటి రశీదులు లేని రూ.10 లక్షలు లభించాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

14 కిలోల గంజాయి స్వాధీనం

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఉప్పుగూడ భయ్యాలాల్‌నగర్‌కు చెందిన పద్మ కుమారుడు శ్రీనివాసాచారి చెడు అలవాట్లకు బానిస కావడంతో కొన్నాళ్ల క్రితం ఇంట్లో నుంచి బయటికి పంపించారు. దీంతో శ్రీనివాస్ సంతోష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాడు. తరచూ ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లే శ్రీనివాస్ గంజాయిని తీసుకొచ్చి యువతకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. మంగళవారం ఉదయం ఓ వ్యక్తి గంజాయి కావాలని కోరడంతో తన తన తల్లిదండ్రులు నివాసం ఉండే భయ్యాలాల్ నగర్‌కు రమ్మని సూచించాడు. 14 కేజీల గంజాయితో ఇంటికి చేరుకోగానే, అప్పటికే సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. పోలీసులను చూసి గోడ దూకి పారిపోయేందుకు యత్నించిన శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఇద్దరు మహిళలను కూడా అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం ఛత్రినాక పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.